సాక్షి ప్రకాశం

శనివారం । 17 । ఫిబ్రవరి । 2024



పురాతన దేశ సంపద యోగా

జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఓంకార నాదంతో మార్మోగింది. 3 వేల మందికిపైగా చిన్నారులు యోగాసనాలు వేశారు. కలెక్టర్ దినేష్ కుమార్ పాల్గొన్నారు.

- IIలో..



సేవలకు ప్రతిరూపం వలంటీర్లు

వలంటీర్లు సేవలకు ప్రతిరూపాలని మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. వలంటీర్ల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు.

- IIలో..

గరిష్టం/కనిష్టం 32/21

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో జిల్లావాసులు

ఒంగోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అనుబంధ కమిటీల్లో జిల్లా వాసులను నియమించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం జరిగిందని పార్టీ కేంద్ర కార్యాలయం ప్రకటించింది. వైఎస్సార్ సేవాదళ్ కార్యదర్శిగా చుక్కా కిరణ్‌కుమార్, రాష్ట్ర సాంస్కృతిక విభాగం ఉపాధ్యక్షునిగా పోకూరి రామకృష్ణారెడ్డి, కార్యదర్శిగా పెనుబోతు రంగారావును నియమించారు.

వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా కమిటీ నియామకం:
వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా కమిటీ నియామక ఉత్తర్వులను శుక్రవారం వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం విడుదల చేసింది. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నియామకం చేపట్టినట్లు పేర్కొన్నారు.

వైఎస్సార్ టీయూసీ జిల్లా కమిటీ:
అధ్యక్షుడు: చిన తిరుపతి యాదవ్ (కనిగిరి), ఉపాధ్యక్షుడు: మొగిలి దేవప్రసాద్ (ఒంగోలు), ప్రధాన కార్యదర్శులు: కస్తాల బాలాజీ (కనిగిరి), కోడూరి వీరాస్వామిరెడ్డి (ఒంగోలు), చేగిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి (గిద్దలూరు), రాయి పేర్రాజు (కొండపి), కాలం కోటిరెడ్డి (వై.పాలెం), సానికొమ్ము తిరుపతిరెడ్డి(దర్శి), మర్రి వెంకట సత్యనారాయణ (దర్శి), కార్యదర్శులు: టి.చంద్రశేఖర్, తేళ్ల ఇంద్రసేనారెడ్డి (దర్శి), పుంగుపాటి ఆంజనేయులు (కనిగిరి), వై.ఆంటోని (కనిగిరి), కాలాది వర్మ, బీరకాయల నాగేశ్వరరావు (ఒంగోలు), స్వర్ణ హరిబాబు, పెట్లూరి కృష్ణమూర్తి (కొండపి), గొల్ల వీర గంగయ్య, మక్కెన బాల గురవయ్య (వై.పాలెం), కొల్లి శేషగిరి, నల్లబోతుల రమేష్ (గిద్దలూరు), సంయుక్త కార్యదర్శులుగా మెట్టు శివరెడ్డి, నాదెండ్ల శ్రీనివాసులు(గిద్దలూరు), గంధం సామేలు, పులిచర్ల మోహన్‌రెడ్డి (ఒంగోలు), మారంరెడ్డి శివారెడ్డి, షేక్ సుల్తాన్‌బాషా (కొండపి), బొమ్మనబోయిన చిన వెంకయ్య, దారం వాసుదేవరెడ్డి (దర్శి), పూమకంటి వెంకటయ్య, మొహమ్మద్ హుస్సేన్ (వై.పాలెం), కోట పాటి కార్తీక్, గంజి గుంట మాల్యాద్రి (కనిగిరి).

తెలుగు భాషాభివృద్ధికి పునరంకితం కావాలి



శ్రీకృష్ణదేవరాయలకు నివాళులర్పిస్తున్న సంఘ సభ్యులు

ఒంగోలు మెట్రో: దేశభాషలందు తెలుగు లెస్స అని ఎలుగెత్తి చాటిన మహా తేజో విరాజం శ్రీకృష్ణదేవరాయల స్ఫూర్తితో మనమందరం తెలుగు భాషాభివృద్ధికి పునరంకితం కావాలని సాహితీ లోకం పిలుపునిచ్చింది. శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం తెలుగు వల్లభుని జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సంస్థ అధ్యక్షుడు కుర్రా ప్రసాద్బాబు మాట్లాడుతూ 500 ఏళ్ల నాడే తెలుగు భాషకు, తెలుగు నేలకు విశిష్టత ఖ్యాతిని కల్పించిన తెలుగు జాతి కీర్తి పతాక రాయల వారిని స్మరించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. తెలుగు భాషకు పూర్వ వైభవాన్ని చేకూర్చడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళిగా పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగభైరవ కళా పీఠం అధ్యక్షుడు డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, నవ్యాంధ్ర రాష్ట్ర రచయితల సంఘం గౌరవ అధ్యక్షురాలు టి.అరుణ, రాయల విగ్రహ ప్రతిష్టాపకులు లలిత కళ అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ సంత వేలూరి కోటేశ్వరరావు, కళా మిత్ర మండలి జాతీయ లోగిలి అధ్యక్షుడు డాక్టర్ నూనె అంకమ్మరావు, ప్రధాన కార్యదర్శి సింహాద్రి జ్యోతిర్మయి, బీరం అరుణ, శ్రీ నాగినేని మెమోరియల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మిడసల మల్లికార్జునరావు, యు.వి.రత్నం, బొమ్మరాజు మారుతీ భాస్కర శర్మ, అనుముల మహేంద్ర కుమార్, ఆంజనేయులు పాల్గొన్నారు.

బర్డ్ ఫ్లూ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

ఒంగోలు సెంట్రల్: బర్డ్ ఫ్లూ వ్యాధి పట్ల కోళ్లఫాం యజమానులు, నాటు కోళ్ల పెంపకందారులు, పశువైద్యులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ కే బేబిరాణి కోరారు. వెల్లంపల్లి వద్ద సత్యనారాయణ రెడ్డి కోళ్ల ఫాంను శుక్రవారం సందర్శించి వ్యాధి పట్ల అవగాహన, ముందస్తు జాగ్రత్తల గురించి చెప్పారు. నెల్లూరు జిల్లాలోని పొదలకూరు మండలంలో కోళ్లలో వచ్చిన బర్డ్ ఫ్లూ వ్యాధి నిర్ధారణ కావటంతో జిల్లాలోని కోళ్ల పెంపకందారులను అప్రమత్తం చేసినట్లు చెప్పారు. జిల్లాలో 8,33,500 కోళ్లు రైతుల వద్ద, ఫాం లలో ఉన్నట్లు చెప్పారు. గాలి ద్వారా వేగంగా వ్యాపించే ఈ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా ఎక్కువ సంఖ్యలో కోళ్లు మరణిస్తే స్థానిక పశువైద్యాధికారి దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. ఈ వ్యాధి కోళ్లకు, వాటి ద్వారా మనుషులకు సోకి ఊపిరితిత్తులకు సంబంధించిన రుగ్మతలు కలగచేస్తాయని చెప్పారు. కోళ్ల ఫాం యజమానులు పక్క జిల్లాల నుంచి కోళ్లను కొనుగోలు చేయటం, కోళ్ల దాణాను కొనుగోలు చేయటం నిషేధించినట్లు చెప్పారు. ఆమె వెంట జిల్లా వ్యాధి నిర్ధారణశాల ఉప సంచాలకు డాక్టర్ ఎస్ కాలేషా ఉన్నారు.



వైపాలెం టీడీపీలో డిష్యుం..డిష్యుం

యర్రగొండపాలెం నియోజకవర్గంలో వరుస పరాజయాలను మూటగట్టుకున్న తెలుగుదేశం పార్టీ పరిస్థితి రోజు రోజుకూ దిగజారిపోతోంది. నియోజకవర్గంలో అసమ్మతి బుసలు కొడుతోంది. పార్టీ సీనియర్ నేతకు, నియోజకవర్గ ఇన్‌చార్జికి మధ్య విభేదాలు పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నాయి. ఒకరిపై ఒకరు సోషల్ మీడియా వేదికగా తీవ్ర ఆరోపణలు గుప్పిస్తున్నారు. ఇరువర్గాలు కారాలు మిరియాలు నూరుతున్నాయి.

సాక్షి ప్రతినిధి, ఒంగోలు

> యర్రగొండపాలెంలో డాక్టర్ మన్నె రవీంద్ర కారణంగా ఇక్కడ తెలుగుదేశం పార్టీ గెలవడం లేదు. అతని దరిద్రాన్ని వదిలిస్తాం. టీడీపీని గెలిపించి మా సత్తా చూపుతాం
>
> – నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎరిక్షన్ బాబు వర్గం

> ఎరిక్షన్ బాబు పార్టీలో గ్రూపులను ప్రోత్సహిస్తున్నాడు. సీనియర్ నాయకులను కలుపుకొని పోవాలనే ఆలోచన అతనికి లేదు. ఎరిక్షన్ బాబుకు సీటు ఇస్తే సహకరించేది లేదు
>
> – డాక్టర్ రవీంద్ర వర్గం

• • •

- ఎరిక్షన్‌బాబు, డా.రవీంద్ర వర్గాల మధ్య ఆధిపత్య పోరు
- రెండు వర్గాలుగా విడిపోయి కుమ్ములాటలు
- అజితారావు అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తున్న రవీంద్ర వర్గం
- సామాజిక మాధ్యమాల్లో విమర్శల జోరు
- రవీంద్రను పార్టీ లోంచి సస్పెండ్ చేయిస్తామంటున్న ఎరిక్షన్ గ్రూపు

ఇది యర్రగొండపాలెంలో తెలుగుదేశం పార్టీ పరిస్థితి. నిత్యం గ్రూపు తగాదాలతో తెలుగు తమ్ముళ్లు సిగపట్లు పడుతున్నారు. సందు దొరికితే చాలు ఒకరిపై ఒకరు తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పించుకుంటున్నారు. నువ్వెంత అంటే నువ్వెంత అనే స్థాయికి విభేదాలు చేరుకున్నాయి. సోషల్ మీడియా వేదికగా పరస్పర ఆరోణలు చేసుకుంటున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఎరిక్షన్ బాబు, సీనియర్ నాయకుడు డా.రవీంద్ర వర్గాల మధ్య ఉప్పు నిప్పులా ఉంది పరిస్థితి. సాక్షాత్తు అధినేత చంద్రబాబు చెప్పినా ఇరువర్గాల నేతలు ఎడమొహం పెడమొహంగా ఉంటున్నారు. కత్తులు దూసుకోవడం మానడం లేదు. నిన్నామొన్నటి వరకు తెరచాటున కొనసాగిన గ్రూపు తగాదాలు గత బుధవారం విలేకరుల సమావేశంతో భగ్గుమన్నాయి. రానున్న ఎన్నికల్లో ఎరిక్షన్ బాబుకు సీటు ఇస్తే తామ సహకరించేది లేదంటూ రవీంద్ర వర్గం బహిరంగంగా ప్రకటించడం నియోజకవర్గంలో సంచలనంగా మారింది. ఈ పరిణామాలు పార్టీ కేడర్‌ను మరింత అయోమయంలో పడేశాయి. పార్టీ ఆవిర్భావం నుంచి యర్రగొండపాలెంలో డాక్టర్ రవీంద్ర పార్టీకి పెద్ద దిక్కుగా ఉన్నారు. వేగినాటి కోటయ్య మరణం తర్వాత ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చిన ఆయన క్రమంగా టీడీపీలో పట్టు పెంచుకొన్నారు. అధినేత చంద్రబాబు సొంత సామాజిక వర్గానికి చెందిన నాయకుడు కావడంతో ఇన్నాళ్లూ ఆయన ఆధిపత్యం కొనసాగింది. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో యర్రగొండపాలెం నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి టీడీపీ వరుస ఓటములతో పడరాని పాట్లు పడుతోంది. ఎస్సీ నియోజకవర్గమైన యర్రగొండపాలెం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి కంచుకోటగా మారింది. 2014, 2019 ఎన్నికల్లో ఇక్కడ నుంచి టీడీపీ తరపున బరిలోకి దిగిన బూదాల అజితారావు వైఎస్సార్ సీపీ అభ్యర్థుల చేతిలో ఓటమి పాలయ్యారు. ఎన్నికల అనంతరం ఆమె నియోజకవర్గ ప్రజలకు ముఖం చాటేశారు. ఈ క్రమంలో టీడీపీ అధిష్టానం గూడూరి ఎరిక్షన్ బాబును నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. ఆయన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి గ్రూపు తగాదాలు ఎక్కువయ్యాయి. అధిష్టానంతో సన్నిహిత సంబంధాలు కలిగిన ఎరిక్షన్ బాబు పార్టీలో రవీంద్ర వర్గాన్ని పూర్తిగా పక్కన పెట్టారు. రవీంద్ర వర్గం దీన్ని జీర్ణించుకోలేకపోయింది. దీంతో ఇద్దరు నాయకుల మధ్య దూరం పెరుగుతూ వచ్చింది.

సోషల్ మీడియా వేదికగా..

యర్రగొండపాలెం నియోజకవర్గంలో డాక్టర్ రవీంద్ర వ్యవహార శైలి వల్లే టీడీపీ ఓడిపోతోందని ఎరిక్షన్ బాబు వర్గం సోషల్‌మీడియా వేదికగా ఆరోపిస్తోంది. అజితారావు ఓటమికి రవీంద్ర వెన్నుపోటు రాజకీయాలే కారణమని విమర్శలు గుప్పించడంతోపాటు టీడీపీ నుంచి రవీంద్రను సస్పెండ్ చేయిస్తామంటూ చాలెంజ్ చేశారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్న తనను సస్పెండ్ చేసే మగాడే పుట్టలేదంటూ రవీంద్ర కౌంటర్ ఇచ్చారు. రవీంద్ర వ్యవహారశైలిని అధినేత చంద్రబాబుకు ఎరిక్షన్ వర్గం వివరించడంతో సీరియస్‌గా తీసుకున్న చంద్రబాబు పార్టీ నుంచి సస్పెండ్ చేయడానికి సిద్ధమైనట్లు సమాచారం. అయితే రవీంద్ర సామాజిక వర్గానికి చెందిన దామచర్ల జనార్దన్ రంగప్రవేశం చేశారు. చంద్రబాబుపై ఒత్తిడి తెచ్చి రవీంద్ర సస్పెన్షన్‌ను అడ్డుకున్నారు. ఈ పరిణామాలు ఇరు వర్గాల మధ్య మరింత దూరం పెంచాయి. ఆ మధ్య యర్రగొండపాలెం పర్యటనకు వచ్చిన చంద్రబాబు ఎరిక్షన్ బాబు అభ్యర్థిత్వాన్ని ఖరారు చేస్తూ ప్రకటన ఇచ్చారు. ఇరువర్గాలు కలిసి పని చేయాలని సూచించారు. కొంత కాలం ఇరువర్గాల నాయకులు కలిసి పనిచేసినట్టే కనిపించారు. అయితే బుధవారం మీడియా వేదికగా రవీంద్రబాబు ఎరిక్షన్ బాబుపై ఆరోపణలు గుప్పించడంతో ఆ ముచ్చట కూడా మున్నాళ్లకే ముగిసింది. ఇదిలా ఉండగా ఎరిక్షన్ బాబు సైతం తన వర్గం మనుషులతో రవీంద్రబాబుపై ఆరోపణలు చేయిస్తున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యత కలిగిన పదవిలో ఉన్న నాయకుడు అందరినీ కలుపుకొని పోకుండా చిల్లర వ్యక్తులతో విమర్శలు చేయిస్తున్నారని రవీంద్ర వర్గం ఎరిక్షన్ బాబు మీద మండిపడుతోంది. ఈ క్రమంలోనే రవీంద్ర వర్గానికి చెందిన మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఆంజనేయులు, మైనారిటీ నాయకుడు షేక్ జిలానీ విలేకరుల సమావేశం పెట్టి ఎరిక్షన్ బాబుకు సీటు ఇస్తే సహకరించేది లేదంటూ కుండబద్దలు కొట్టారు. ఇక లాభం లేదని, అధిష్టానంతో తాడో పేడో తేల్చుకోవాలని రవీంద్ర వర్గం భావిస్తున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.

రాజీనామా దిశగా రవీంద్ర వర్గం

బాబుకు బదులుగా బూదాల అజితారావుకు సీటు ఇవ్వాలని రవీంద్ర వర్గం అధిష్టానం వద్ద ప్రతిపాదిస్తున్నట్లు సమాచారం. ఆమెను అభ్యర్థిగా పోటీకి నిలబెడితే తామంతా సహకరిస్తామని, గతంలో రెండు సార్లు ఓటమి చెంది ఉండటంతో సానుభూతి కూడా కలిసొస్తుందని చెబుతున్నారు. ఒకవేళ ఎరిక్షన్ బాబు అభ్యర్థిత్వం వైపే అధిష్టానం మొగ్గు చూపితే పార్టీకి రాజీనామా చేయాలని రవీంద్ర వర్గం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఒకవేళ మాజీ శాసనసభ్యుడు డేవిడ్‌రాజు కనుక కాంగ్రెస్ సీటు తెచ్చుకుంటే ఆయన విజయానికి పాటుపడాలని, తద్వారా ఎరిక్షన్ బాబును దెబ్బతీయాలని రవీంద్ర వర్గం ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఎన్ని కుట్రలు చేసినా పట్టాలిచ్చి తీరుతాం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలినేని, కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ పరమేశ్వరరెడ్డి

- నగరంలో పూరి గుడిసె ఉండకూడదు
- పేదలందరూ సొంత పక్కా గృహాల్లో ఉండాలి
- పేదలకు మేలు జరగడం టీడీపీ నాయకులకు ఇష్టం లేదు
- రాజకీయంగా నన్ను ఎదుర్కోలేకే పేదలకు అన్యాయం చేస్తున్నారు
- 20వ తేదీ సీఎం చేతుల మీదుగా పట్టాల పంపిణీ
- రైతుల నుంచి డబ్బు తీసుకున్నట్లు రుజువు చేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటా
- భూములిచ్చిన రైతుల్లో టీడీపీకి చెందిన వారు కూడా ఉన్నారు
- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు అర్బన్: ''నగరంలో 25 వేల మంది పేదలకు ఇళ్ల పట్టాలు ఎలాగైనా ఇవ్వాలని భావించా. అందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఒప్పించా. అధికారులు స్థలాలను ఎంపిక చేశారు. రైతుల దగ్గర నుంచి స్థలాల కొనుగోలుకు రూ.210 కోట్లు అవసర మవుతుందని అధికారులు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. నేను దగ్గరుండి ప్రభుత్వం నుంచి నిధులు విడుదల య్యేలా చూశా. అవి నేరుగా కలెక్టర్ అకౌంట్‌లోకి వచ్చాయి. అధికారులు నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేశారు. ఇలా అంతా పారదర్శకంగా జరిగితే నాపై బురదజల్లడం ఏమిటి'' అని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి తెలుగుదేశం పార్టీ నేతలపై మండిపడ్డారు. తాను ఎకరాకు రూ.8 లక్షలు వసూలు చేశానని ఆరోపణలు చేయడం సరికాదన్నారు. రైతుల వద్ద నుంచి డబ్బు తీసుకోవడం వంటి నీతి మాలిన పనులు తాను చేయనన్నారు. స్థలాలు ఇచ్చిన వారిలో తెలుగుదేశం పార్టీకి చెందిన వారు కూడా ఉన్నారని, ఏ ఒక్కరైతు నుంచైనా చెప్పించండి.. రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ విసిరారు. పేదలకు ఎలాగైనా ఇళ్లు ఇవ్వాలని లక్ష్యంతో తన రాజకీయ జీవితాన్ని సైతం ఫణంగా పెట్టానన్నారు. టీడీపీ వాళ్లకి అంత బాధగా ఉంటే తాను రాజకీయాల నుంచి తప్పుకుంటాను, కానీ పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడం మాత్రం ఖాయమన్నారు. పేదలకు మేలు జరగడం తెలుగుదేశం నాయకులకు ఇష్టం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలకు మేలు చేయాలని చూస్తున్న తనపై ఇటువంటి ఆరోపణలు చేయడానికి కనీసం సిగ్గు ఉందా అని ప్రశ్నించారు. శుక్రవారం మల్లేశ్వరపురంలో పేదల ఇంటి స్థలాలకు సంబంధించిన పనులను కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, ఎస్పీ పరమేశ్వరరెడ్డిలతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వకుండా తెలుగుదేశం పార్టీ నాయకులు నాలుగేళ్లగా ఎన్నో కుట్రలు, కుతంత్రాలు పన్నుతూనే ఉన్నారని ఆరోపించారు. రాజకీయంగా తనను ఎదుర్కోలేక పోవడం, ఒకేసారి 25 వేల మందికి ఇళ్లపట్టాలు ఇస్తే తనకు మంచి పేరు వస్తుందనే దురుద్దేశంతో పేదలకు మేలు జరగకుండా అడ్డుపడేందుకు కూడా వెనుకాడటం లేదని మండిపడ్డారు. ఈ నెల 20 వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా నగరంలో పట్టాల పంపిణీ కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఎప్పటి నుంచో ఎదురు చూస్తున్న జగనన్న కాలనీ ఇళ్ల స్థలాలు ఇవ్వడం సంతోషకరంగా ఉందన్నారు. గతంలో యరజర్ల వద్ద ప్రభుత్వ భూమిని పేదలకు ఇంటి పట్టాలు ఇచ్చేందుకు సిద్ధం చేశామని, పట్టాల పంపిణీకి సిద్ధమైన వాటిని తెలుగుదేశం పార్టీ నేతలు కోర్టుకు వెళ్లి ఆపారన్నారు. టీడీపీ కుట్రలతో ప్రజలు బాధపడుతున్న విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లానని, భూమి కొనుగోలు చేసి అయినా పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించినట్లు వివరించారు. ఆ మేరకు రూ.221 కోట్లు మంజూరు చేసి విడుదల చేశారని తెలిపారు. టీడీపీ నాయకులు మాత్రం విష ప్రచారాలు చేస్తూనే ఉన్నారని, డబ్బు రాదని, ఇళ్ల పట్టాలు ఇవ్వరని అసత్య ప్రచారం చేశారన్నారు. కానీ చెప్పిన మాట ప్రకారం ప్రభుత్వం డబ్బు విడుదల చేసిందని తెలిపారు. పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వకుంటే ఎన్నికల్లో పోటీ చేయనని చెప్పానన్న విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పుడు అమ్మ ఒడి, చేయూత వంటి కార్యక్రమాలు ఉన్నా ఇళ్ల స్థలాల పంపిణీకి అవసరమైన డబ్బును అందజేశారన్నారు. ఆ మేరకు భూములు ఇచ్చిన రైతులకు డబ్బు కూడా అకౌంట్లలో వేశామన్నారు. ఇప్పుడు మళ్లీ పేదలకు సక్రమంగా పంపిణీ చేయడం లేదని, తాను రైతుల నుంచి ఎకరాకు రూ.8 లక్షలు తీసుకున్నాని పట్టాల పంపిణీ నిలిపివేసేందుకు కుట్రలు చేస్తూ పిల్ వేశారన్నారు. అధికారులు పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేశారని చెప్పారు. కనీసం తన దగ్గర పనిచేసే డ్రైవర్‌లకు కూడా రికమండ్ చేయలేదన్నారు. 6 దశల వెరిఫికేషన్ ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేశామన్నారు. పేదలకు పట్టాలు ఇవ్వ కూడదని, పట్టాలు ఇస్తే బాలినేనికి పేరు వస్తుందని కుట్రలు పన్నుతున్నారన్నారు. ప్రజలే చెప్పుతో కొట్టి బుద్ధి చెప్తారని హెచ్చరించారు. తాజాగా సచివాలయాల్లో సుమారు 7 వేల మంది దరఖాస్తు చేసుకున్నారని, అర్హులైన వారందరికీ పట్టాలు ఇస్తామని స్పష్టం చేశారు. లే అవుట్‌లలో కూడా గ్రేటర్ కమ్యూనిటీలో ఉండే సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శ్మశాన వాటికకు భూమిని కేటాయించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

కలెక్టర్ దినేష్ కుమార్ మాట్లాడుతూ ఒంగోలు అర్బన్‌లో జగనన్న కాలనీల కింద ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు పంపిణీ కార్యక్రమం సిద్ధమైందని తెలిపారు. ఈ నెల 20వ తేదీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒంగోలుకు వచ్చి పంపిణీ కార్యక్రమం ఆయన చేతుల మీదుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రూ.221.30 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని, దీనికి సంబంధించి భూమి కొనుగోలు, లే అవుట్ అభివృద్ధికి కేటాయించి పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నామన్నారు. 540 ఎకరాలు అగ్రహారం, మల్లేశ్వరపురం, యరజర్ల, ముక్తినూతలపాడుల్లో 460 ఎకరాలు సేకరించామన్నారు. మిగిలిన భూమి రెండు రోజుల్లో సేకరణ పూర్తి చేస్తామన్నారు. లే అవుట్‌లలో మౌలిక సదుపాయాలకు రూ.22.33 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. అందుకు సంబంధించి టెండర్లు పూర్తి చేసి పనులు చేస్తున్నామన్నారు. యరజర్లలో గతంలోనే స్థలాలకు కేటాయించి ఇళ్లు కూడా మంజూరు చేసిన 10 వేల మందికి కూడా వీటిలోనే కేటాయిస్తున్నామన్నారు. అర్హులందరికీ ఇళ్ల స్థలాలు ఇస్తామన్నారు. ముఖ్యమంత్రి చేతుల మీదుగా 22 వేల మందికి కన్వేయన్స్ డీడ్స్, హౌసింగ్ మంజూరు పత్రాలు కూడా ఇస్తామని చెప్పారు.

సీఎం కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

ఒంగోలు అర్బన్: ఈ నెల 20వ తేదీ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేతుల మీదుగా 22 వేలమంది పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేస్తున్నామని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం మల్లేశ్వరపురం, అగ్రహారం, వెంగముక్కలపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న జగనన్న టౌన్‌షిప్‌లలో ఇళ్ల పట్టాల పంపిణీకి ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ పరమేశ్వరరెడ్డిలతో కలిసి అగ్రహారం లే అవుట్‌ను పరిశీలించి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం అగ్రహారం గ్రామ పరిసర ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లు, హెలీప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలు, సభా వేదిక ప్రాంతాన్ని పరిశీలించి తగు సూచనలు చేశారు. సీఎం పర్యటన ఏర్పాట్లకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై పలు శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో బాలినేని మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేసేందుకు అన్నీ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నగర మేయర్ గంగాడ సుజాత, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నగర బడ్జెట్ రూ.191.35 కోట్లు



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న మేయర్ గంగాడ సుజాత

- 2024–25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ఆమోదం
- రాబడి, ఖర్చులు పోను రూ.10.64 కోట్లు మిగులు
- ఎస్సీ, ఎస్టీ నివాస ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.3.26 కోట్లు
- స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, వికలాంగుల సంక్షేమం కోసం మరో రూ.1.20 కోట్లు
- మురికివాడల్లో అభివృద్ధి పనులకు రూ.5.98 కోట్లు
- నగర అభివృద్ధిపై బాలినేని ప్రత్యేక శ్రద్ధ.. సభ దృష్టికి తెచ్చిన సభ్యులు
- మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశం

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగర పాలక సంస్థ 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.191.35 కోట్ల అంచనాతో రూపొందించిన బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. గత రెండు సంవత్సరాలతో పోలిస్తే రానున్న ఆర్థిక సంవత్సరంలో నగరాన్ని అభివృద్ధి పథంలో నిడిపించే దిశగా నిధుల వరద కురిపించారు. స్థానిక కౌన్సిల్ హాలులో శుక్రవారం ఒంగోలు నగర పాలక సంస్థ 2024–25 అంచనా బడ్జెట్ సమావేశం నగర మేయర్ గంగాడ సుజాత అధ్యక్షతన నిర్వహించారు. ఈ బడ్జెట్ సమావేశంలో సవరణ బడ్జెట్ గణాంకాలతో పాటు రానున్న 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి అంచనా బడ్జెట్‌ను కౌన్సిల్‌లో ప్రవేశ పెట్టారు మేయర్ గంగాడ సుజాత. ఈ బడ్జెట్‌కు సంబంధించి అభివృద్ధి పనులను సైతం ప్రతిపక్ష టీడీపీ, జనసేన సభ్యులు అడ్డుకోవాలని ప్రయత్నించారు. అయితే అధికార వైఎస్సార్‌సీపీ సభ్యులు అందుకు దీటుగా ఎదుర్కొని 2024–25 అంచనా బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదింపజేశారు. ఈ బడ్జెట్‌ను చూస్తేనే ఒంగోలు నగరంలో నిధుల వరద కురిపించినట్లు అయింది. ఏడాదికేడాదికి ఒంగోలు నగరం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్ సాధారణ, మూల ధన అంత్య విలువ (మిగులు) రూ.38.01 కోట్లుగా తేల్చారు. అందుకు సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సరానికి అంచనా రాబడులు (జమలు) రూ.153.34 కోట్లు వస్తాయని లెక్కలేశారు. దీంతో మిగులు, అంచనా రాబడులు కలుపుకొని మొత్తం రూ.191.35 కోట్లుగా తేల్చారు. అందుకుగాను రానున్న ఆర్థిక సంవత్సరానికి అన్ని రకాల ఖర్చులను అంచనా వేసి రూ.180.71 కోట్లుగా తేల్చారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి మిగులుగా రూ.10.64 కోట్లు ఉండవచ్చని అంచనా వేశారు. నగర పరిధిలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు నివాసం ఉండే ప్రాంతాల్లో కూడా అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించారు. అదేవిధంగా స్త్రీ సంక్షేమ శాఖ, వికలాంగుల సంక్షేమం కోసం కూడా 2024–25 అంచనా బడ్జెట్‌లో కేటాయింపులు చేశారు. వీటితో పాటు మురికివాడల అభివృద్ధిపై కూడా ప్రత్యేకంగా నిధుల వరద కురిపించారు. వరుసగా మూడు సంవత్సరాల బడ్జెట్‌లను పరిశీలిస్తే బడ్జెట్‌లో కేటాయింపులు పెంచుకుంటూ పోతూనే ఉన్నారు.


నగర అభివృద్ధికి బాలినేని పట్టుదలతో...

కౌన్సిల్ సమావేశంలో మేయర్ గంగాడ సుజాత నూతన ఆర్థిక సంవత్సరానికి అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాస రెడ్డి ఒంగోలు నగర అభివృద్ధి కోసం ఎంతో పట్టుదలతో ఉన్నారని సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇప్పటికే నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయటంతో పాటు ఈ నెల 20వ తేదీన 25 వేల మంది పేదల సొంతింటి కల తీర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఒంగోలు వస్తున్నారని చెప్పారు. అమృత్ 2.0 పథకానికి రూ.350 కోట్లు మంజూరు చేయించి పనులకు భూమి పూజ చేయించేందుకు పూనుకున్నారన్నారు. అందు కోసమే 2024–25 ఆర్థిక సంవత్సరంలో కూడా ఒంగోలు నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయటానికి రూ.191.35 కోట్లతో అంచనా బడ్జెట్‌ను రూపొందించేందుకు వాసన్న ఆలోచనలు ఇమిడి ఉన్నాయని కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు.

డిప్యూటీ మేయర్ వెలనాటి మాధవరావు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం రాబడులను పెంచుకుంటూ పోతున్నామన్నారు. అదేస్థాయిలో నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని వెల్లడించారు. ఆదాయానికి సంబంధించి ప్రధానంగా ఇంటి పన్ను, కుళాయి పన్ను, ఖాళీ స్థలం పన్నులతో పాటు మరికొన్ని రకాలుగా ఆదాయాలు వస్తాయని వివరించారు. ఖర్చుల విషయానికి ప్రధానంగా జీతభత్యాలు, రోడ్ల నిర్మాణం, డ్రైనేజీ కాలువల నిర్మాణాలు, పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరాతో పాటు అనేక రకాలుగా ఖర్చు చేయాల్సి వస్తుందన్నారు. తొలుత నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిషనర్ ఎం.జశ్వంతరావును మేయర్ గంగాడ, డిప్యూటీ మేయర్లు వేమూరి, వెలనాటితో పాటు స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.జశ్వంతరావుతో పాటు ఏసీపీ కేవీ.వెంకటేశ్వర్లు, ఏఓ తుపాకుల మధు బాబు, మున్సిపల్ ఆడిటర్, శానిటరీ సూపర్‌వైజర్ ఎస్.పిచ్చయ్యతో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు.

విభాగాలు	నిధుల కేటాయింపు
షెడ్యూల్డ్ కులాల ప్రాంతాల్లో	రూ.2.27 కోట్లు
షెడ్యూల్డ్ తెగల ప్రాంతాల్లో	రూ.98.69 లక్షలు
స్త్రీ శిశు సంక్షేమం కోసం	రూ.74.76 లక్షలు
వికలాంగుల సంక్షేమానికి	రూ.44.86 లక్షలు
మురికివాడల అభివృద్ధికి	రూ.5.98 కోట్లు

తారురోడ్డు నిర్మాణానికి భూమి పూజ



రోడ్డు నిర్మాణానికి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లి వద్ద ఉన్న జాతీయ రహదారి నుంచి అన్నంగి వరకూ తారురోడ్డు పునర్నిర్మాణానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేరుగు నాగార్జున శుక్రవారం ఉదయం భూమి పూజ చేసి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లవరం రిజర్వాయర్‌కు వెళ్లే తారు రోడ్డు పూర్తిగా ధ్వంసమైపోవడంతో పునర్నిర్మాణానికి రూ.1.2 కోట్లతో మంజూరు చేయించినట్లు తెలిపారు. దీని వలన మల్లవరం రిజర్వాయర్‌కు రహదారి సుగమమౌతుందని అన్నారు. గ్రామాలకు అనుబంధంగా తారు రోడ్డు నిర్మాణానికి సహకరించిన మంత్రికి రెండు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పలువురు నాయకులు సంతోషం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షుడు మండవ అప్పారావు, పార్టీ ప్రధాన కార్యదర్శి వాకా కోటిరెడ్డి, వైస్ ఎంపీపీ పైడిపాటి వెంకట్రావు, సీనియర్ నాయకులు తేళ్ల పుల్లారావు, గట్టినేని అయ్యన్న లింగా రామకృష్ణారెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు బెజవాడ రాము, పోతినేని శ్రీనివాసరావు, రాయపాటి రమేష్, ఎంపీటీసీ సభ్యులు పల్లకి పద్మకుమారి, బొమ్మల దేవదాసు, రాయపాటి సుజాత, సర్పంచ్‌లు కొప్పోలు ఆంజనేయులు పల్లపాటి లోకేశ్వరి, దేవరపల్లి గంగిరెడ్డి బొమ్మల రామాంజనేయులు, నాయకులు అన్వేష్, దుడ్డు వినోద్, పలువురు పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి సురేష్‌ను కలిసిన ఎస్పీ



రాష్ట్ర మంత్రి ఆదిమూలపు సురేష్ పుష్ప గుచ్ఛం అందిస్తున్న ఎస్పీ పరమేశ్వర రెడ్డి

ఒంగోలు సబర్బన్: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్‌ను ఎస్పీ పి.పరమేశ్వర రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు ఎస్పీ సంతపేటలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాత్రి బాధ్యతలు తీసుకున్న తరువాత మొదటి సారిగా కలిశారు. ఎస్పీ పూల మొక్కను అందించి మంత్రి సురేష్‌ను అభినందించారు. ఇరువురు కొంతసేపు జిల్లాలోని పరిస్థితులపై సమీక్షించుకున్నారు. కొండపి అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయ, సామాజిక పరిస్థితులపై ఇరువురు లోతుగా చర్చించుకున్నట్లు సమాచారం.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



సింగరాయకొండ రైల్వేస్టేషన్‌లో మృతి చెందిన వ్యక్తి

సింగరాయకొండ (మర్రిపూడి): సింగరాయకొండ రైల్వేస్టేషన్ లోని ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై శుక్రవారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తి (40) మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఇతని కుడి కన్ను పై భాగంలో రక్త గాయాలయ్యాయి. ఇతను వంకాయ కలర్ నిండు చేతుల చొక్కా, కాఫీ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడు. పోస్టుమార్టం నిమిత్తం ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు. ఇతని ఆచూకీ తెలిసిన వారు 9440904870, 7013915467 నంబర్లకు సమాచారం అందించాలని వివరించారు.

చెక్‌డ్యాంలో పడి వృద్ధుడు మృతి

పామూరు: ప్రమాద వశాత్తు చెక్ డ్యాంలో పడిపోయి వృద్ధుడు మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలోని పాబోలువారిపల్లె సమీపంలోని దాసరివాగు చెక్ డ్యాంలో చోటు చేసుకుంది. ఎస్సై తెలిపిన వివరాలు.. పాబోలువారిపల్లె గ్రామానికి చెందిన వడ్డెపల్లి మాలకొండయ్య సమీపంలోని సుబాబుల్ తోటకు కాపలాగా వెళ్తుంటాడు. కాగా శుక్రవారం మాలకొండయ్యకు ఆరోగ్యం సరిలేకపోగా మార్గమధ్యంలో దాసరి వాగు చెక్‌డ్యామ్ వద్దకు బహిర్భూమికి వెళ్లాడు. ఈసందర్భంగా ప్రమాదవశాత్తు మాలకొండయ్య (83) చెక్‌డ్యామ్ నీటిలో పడి మృతిచెందాడు. కొంత సమయం తరువాత గమనించినవారు.. కుటుంబ సభ్యులకు తెలపగా అక్కడికి వెళ్లి చూసేసరికి మృతి చెందిన ఉన్నాడు. నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు నరసింహ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కనిగిరి వైద్యశాలకు తరలిస్తున్నట్లు ఎస్సై సైదుబాబు తెలిపారు. కాగా అప్పటివరకు తమతో ఉన్న తండ్రి మృతి చెందడంతో మృతుని కుటుంబంలో విషాదం నెలకొంది.

గిద్దలూరు గడ్డ.. వైఎస్సార్ సీపీ అడ్డా..



ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డిలకు ఘన స్వాగతం పలుకుతున్న పార్టీ నాయకులు



కంభం చేరుకున్న భారీ కార్ల ర్యాలీ

- ఇకపై నా సేవలు గిద్దలూరు నియోజకవర్గ ప్రజల కోసం..
- అవకాశం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు
- పార్టీ శ్రేణులందరికీ కుటుంబ సభ్యుడిలా తోడూనీడగా ఉంటా..
- వైఎస్సార్ సీపీ గిద్దలూరు ఇన్‌చార్జి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- తొలిసారి నియోజకవర్గ పర్యటన సందర్భంగా ఘన స్వాగతం

బేస్తవారిపేట/కంభం/కొమరోలు/గిద్దలూరు రూరల్: 'గిద్దలూరు నియోజకవర్గం వైఎస్సార్ సీపీ కంచుకోట. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై మీరు చూపించే ప్రేమకు పాదాభివందనం. సీఎం ఆశించిన విధంగా ముందుకు సాగుదాం' అని వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. గిద్దలూరు ప్రజలకు సేవ చేసుకునే అవకాశం కల్పించిన జగనన్నకు కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తొలిసారి పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే కేపీకి పార్టీ నేతలు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. మార్కాపురం నుంచి 100 కార్లతో ర్యాలీగా బయలుదేరిన ఎమ్మెల్యేకు కంభం మండలం జంగంగుంట్ల గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులు స్వాగతం పలికి, గజమాలతో సన్మానించారు. కంభంలోని కందులాపురం సెంటర్‌లో అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు ఎమ్మెల్యే కేపీ నివాళులర్పించారు. బేస్తవారిపేట బస్టాండ్ సెంటర్‌లో ఎమ్మెల్యే కేపీ, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డిని వైఎస్సార్ సీపీ శ్రేణులు గజమాలతో సత్కరించారు. కొమరోలు మండలంలోని తాటిచెర్ల మోటులో పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. గిద్దలూరు ఆర్టీసీ బస్టాండ్ వద్ద వైఎస్సార్ సీపీ నాయకుడు సీహెచ్ శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బైక్ ర్యాలీతో స్వాగతం పలికారు. రాచర్ల గేటు సెంటర్‌లో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పార్టీ శ్రేణులను ఉద్దేశించి ప్రసంగించిన అనంతరం ర్యాలీగా పాతాళనాగేశ్వరస్వామి ఆలయానికి చేరుకుని పూజలు నిర్వహించారు.

ఆయా కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు, ప్రజలనుద్దేశించి ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ.. పులివెందుల తర్వాత గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు వైఎస్సార్ సీపీకి భారీ మెజార్టీ ఇచ్చారని, రానున్న ఎన్నికల్లో అదే అభిమానం చూపాలని విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో పర్యటిస్తానని, పార్టీ శ్రేణులకు కుటుంబ సభ్యుడిలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కేపీ కొండారెడ్డి, పగడాల రామయ్య, ఉడుముల శ్రీనివాసరెడ్డి కృషితో అప్పటి సీఎం డాక్టర్ వైఎస్సార్ వెలిగొండ ప్రాజెక్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. త్వరలోనే వైఎస్సార్ తనయుడు సీఎం వైఎస్ జగన్ వెలిగొండను ప్రారంభించనున్నారని అభిమానుల హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. అర్హతే ప్రామాణికంగా, గడప ముంగిటకే సంక్షేమ పథకాలు అందిస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని కోరారు. జగనన్నను మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు కష్టపడి పనిచేద్దామని పిలుపునిచ్చారు.

బేస్తవారిపేటలో జెడ్పీటీసీ బీవీ రాజయ్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొండా రఘునాథరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు డి.ఖాజామీయా, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి పెరుమారెడ్డి ఈశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ పి.వెంకటరాజు, జేసీఎస్ కన్వీనర్ టీవీఎస్‌పీ శర్మ, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు బొల్లా బాలిరెడ్డి, కంభంలో రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ కేవీ రమణారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ యేలం వెంకటేశ్వర్లు, నెమలిదిన్నె చెన్నారెడ్డి, కంభం, అర్ధవీడు మండల పార్టీ అధ్యక్షుడు గొంగటి చెన్నారెడ్డి, చేగిరెడ్డి పోతిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డిష్ మున్నా, చేగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, సబ్బసాని సాంబశివారెడ్డి, హుస్సేన్‌బాష, లాయర్ శ్రీనివాసరెడ్డి, సయ్యద్ సలీం, నరాల ఈశ్వరరెడ్డి, సూర్యప్రకాష్, కొమరోలు జెడ్పీటీసీ సారె వెంకటనాయుడు, గిద్దలూరులో డాక్టర్ సీహెచ్.రంగారెడ్డి, గిద్దలూరు మాజీ ఎంపీపీ కడప వంశీధరరెడ్డి, వైస్ ఎంపీపీ నోవెల్, సీఆర్‌ఐ మురళి, పగడాల రంగస్వామి, డాక్టర్ భూమా నరసింహారెడ్డి, వెంకటరామిరెడ్డి, జనార్దన్‌రెడ్డి, బాలచెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా సంక్షేమం

- ప్రజల నమ్మకం సీఎం వైఎస్ జగన్
- ముస్లింలకు 4 శాతం రిజర్వేషన్ వైఎస్సార్ ఘనతే
- వలంటీర్ల సేవలు అమోఘం
- వైఎస్సార్ సీపీ దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ



మసీదులో ప్రార్థనలు చేస్తున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: అర్హతే ప్రామాణికంగా.. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేద ప్రజలకు భరోసాగా నిలుస్తున్నారని వైఎస్సార్ సీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. జగనన్నపై పేదల ఆప్యాయతను చూస్తే రాష్ట్రంలో 175కి 175 సీట్లు వైఎస్సార్ సీపీ కై వసం చేసుకోవడం ఖాయంగా కనిపిస్తోందన్నారు. శుక్రవారం దర్శి పట్టణంలోని 17వ వార్డులో మన ఊరు–మన శివన్న కార్యక్రమంలో భాగంగా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారికి గడప గడపలో అపూర్వ స్వాగతం లభించింది. స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ.. ముస్లిం మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు ఇచ్చిన ఘనత వైఎస్సార్‌దేనని గుర్తు చేశారు. నవరత్నాలు పథకాల ఫలాలను ప్రజలకు అందించడంలో వలంటీర్లు చేస్తున్న సేవలు మరువలేనివన్నారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు అర్హులైన పేదలకు ఎటువంటి పథకాలు లభించలేదని, జన్మభూమి కమిటీలు ప్రజల సొమ్మును దోచుకు తిన్నాయని మండిపడ్డారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు.

కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ షకీలా అమీన్ బాషా(మిల్లర్‌బుజ్జి), షేక్ కార్పొరేషన్ డైరెక్టర్, వైద్య విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్ఎం బాషా, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గాలిమూటి దేవప్రసాద్, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు షేక్ సైదా, వార్డు ఇన్‌చార్జి పాఠెం మజ్జువలి, పాఠెం రహమాన్, ఏఎంసీ వైస్ చైర్మన్ పాఠెం హుస్సేన్, ముస్లిం వెల్ఫేర్ నియోజకవర్గ అధ్యక్షుడు సౌదాగర్ రహ్మతుల్లా పట్టణ అధ్యక్షుడు కట్టెకోట హరీష్, మండల అధ్యక్షులు వెన్నపూస వెంకటరెడ్డి, ప్రచార కమిటీ జిల్లా కార్యదర్శి అంకబాబు, కాపా రమణారెడ్డి, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కుమ్మిత అంజిరెడ్డి, నెడ్‌క్యాప్ చైర్మన్ సానికొమ్ము తిరుపతిరెడ్డి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ విమల రామకృష్ణ, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, సోషల్ మీడియా కోఆర్డినేటర్ యరమల మధుసూధన్‌రెడ్డి, ఎంపీటీసీల సంఘం జిల్లా అధ్యక్షుడు బండి గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సోము దుర్గారెడ్డి, జేసీఎస్ పట్టణ కన్వీనర్ ఎదురు కోటిరెడ్డి, పార్టీ నేతలు కోరే సుబ్బారావు, కర్జా భాస్కర్‌రెడ్డి, నబీ, మీరావలి, మునీర్, దిలీప్, పాఠెం వెంకటేష్, వెన్నపూస బాపిరెడ్డి, అంబటి వీరారెడ్డి, శేషం రమణయ్య, కరిపిరెడ్డి సుబ్బారెడ్డి, ముప్పూరి బ్రహ్మయ్య, కర్జా వెంకటరెడ్డి, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



దర్శిలో బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న మహిళలు

ఆశీర్వదించండి.. అండగా ఉంటా..

- వైఎస్సార్ సీపీ విజయానికి సైనికుల్లా పనిచేయండి
- కార్యకర్తల సమావేశంలో మార్కాపురం ఇన్‌చార్జి, ఎమ్మెల్యే అన్నా రాంబాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు, ఆశీస్సులతో మార్కాపురం నియోజకవర్గం నుంచి వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్నానని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు పేర్కొన్నారు. గురువారం రాత్రి పట్టణంలోని సెవెన్ హిల్స్ లాడ్జిలో మార్కాపురం వైఎస్సార్ సీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే అన్నా మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, మార్కాపురం నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. గత కొన్నేళ్లుగా తన తల్లిదండ్రుల పేరుమీద ట్రస్టు నడుపుతూ కులమతాలకు అతీతంగా సేవ చేశానన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లాగా పని చేసి తన విజయానికి సహకరించాలని కోరారు. తొలుత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఏఎంసీ చైర్మన్ షంషేర్ ఆలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు షేక్ ఇస్మాయిల్, అంజమ్మ శ్రీనివాసులు, ఏఎంసీ మాజీ చైర్మన్లు గుంటక సుబ్బారెడ్డి, గొలమారి శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ అరుణా చెంచిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మీరావలి, మాజీ వైస్ చైర్మన్ షెక్షావలి, షాదీఖానా కమిటీ చైర్మన్ ఇస్మాయిల్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ మురళి, యార్డు డైరెక్టర్లు డాక్టర్ మక్బుల్ బాషా, పీఎల్‌పీ యాదవ్, పార్టీ కౌన్సిలర్లు కొత్త కృష్ణ, దారివేముల హర్షిత, చాటకొండ చంద్ర, కోఆప్షన్ సభ్యులు రఫీ, వార్డు ఇన్‌చార్జి రోజ్‌లిడియా, బూదాల గురవయ్య, కోఆప్షన్ సభ్యురాలు వనజాక్షి, అమీరుల్లాఖాన్, గోపాలుని హరిహరరావు, శివాలయం చైర్మన్ కేశవశర్మ, వైఎస్సార్ సీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలు కె.దుర్గ, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు టి.బాలసుబ్బారావు, చెన్నకేశవస్వామి ఆలయ గౌరవ అధ్యక్షుడు కేశవరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే అన్నా రాంబాబును పార్టీ నేతలు ఘనంగా సన్మానించారు.

పేదల అవసరాలను తీర్చే పార్టీలనే గెలిపించాలి

- బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



స్థానిక నాయకులతో రాష్ట్ర బీసీ నేతలు

పెద్దదోర్నాల: పేదల ఆకాంక్షలను నెరవేర్చి, వారి అవసరాలను తీర్చే పార్టీలనే రానున్న ఎన్నికల్లో గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక బొగ్గరపు సత్యమమ్మ కళ్యాణ మండపంలో బీసీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నిజాలను అబద్ధాలుగా, అబద్ధాలను నిజాలుగా నమ్మించే బూర్జువా పార్టీలు చెప్పే మాయ మాటలను నమ్మొద్దని సూచించారు. ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న వారిని మాత్రమే నమ్మి, రానున్న ఎన్నికల్లో వారికి ఓట్లు వేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం యువజన ఉపాధ్యక్షుడు గుర్రం ద్వారకా శ్రీను, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు బొలగాని ఆంజనేయులు, స్థానిక బీసీ సంఘం నాయకులు బండారు సుబ్బనారాయణ, రమేష్ బాబు, కన్నెగంటి శ్రీను పాల్గొన్నారు.

సేవలకు ప్రతిరూపం వలంటీర్లు

- అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా జగనన్న పాలన
- రాష్ట్ర మున్సిపల్ శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్




వలంటీర్ల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సురేష్

కొండపి(మర్రిపూడి): వలంటీర్లు సేవలకు ప్రతిరూపాలని, నిజాయితీ, నిబద్ధతే గ్రామ వలంటీర్ వ్యవస్థ ముఖ్య ఉద్దేశమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి, వైఎస్సార్‌సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కొనియాడారు. కొండపి ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం కొండపి, మర్రిపూడి, పొన్నలూరు మండలాల గ్రామ వలంటీర్ల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మంత్రి సురేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2.50 లక్షల మంది గ్రామ వలంటీర్లు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేస్తున్నారన్నారు. వీరిలో 85 శాతం మంది డిగ్రీ, పీజీ చదివిన వారే ఉండటం విశేషమని పేర్కొన్నారు. రాష్ట్రంలో 24కు పైగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుండగా సుమారు 4 లక్షల కోట్ల రూపాయలకు పైగా సొమ్మును అర్హులకు అందించారని, ఇది గ్రామ వలంటీర్ల వ్యవస్థ గొప్పదనమని కొనియాడారు. టీడీపీ ప్రభుత్వం జన్మభూమి కమిటీలు వేసి దోపిడీకి తెరలేపితే.. సీఎం వైఎస్ జగన్ మాత్రం వలంటీర్లతో ఇంటింటికీ పథకాలు అందించి అండగా నిలిచారన్నారు. ఈ రోజు నాయకులు, అధికారుల పేరు తెలిసినా తెలియకపోయినా ప్రతి ఒక్కరికీ వలంటీర్ పేరు మాత్రం తెలుసన్నారు. గ్రామ వలంటీర్లను మరింత ప్రోత్సహించేందుకు ఏటా ఇస్తున్న గౌరవ పురస్కారాల మొత్తాన్ని 50 శాతం పెంచినట్లు పేర్కొన్నారు. కరోనా సమయంలో వలంటీర్లు అందించిన సేవలు చిరస్మరణీయమని మంత్రి సురేష్ కొనియాడారు. అవార్డు గ్రహీతలైన పలువురు వలంటీర్లను మంత్రి సత్కరించారు.

ఎంపీపీలు వాకా వెంకటరెడ్డి, కొండాబత్తిన మాధవరావు, జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ పి.నాగమణి, పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి డాకా పిచ్చిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఆరికట్ల కోటిలింగం, దద్దాల మల్లికార్జునరావు, పల్లపోతు బాలకోటిరెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్లు గొట్టిపాటి మురళి, పిల్లి తిరుపతిరెడ్డి, సంజీవరెడ్డి, వైస్ ఎంపీపీ వేముల ప్రసాద్, కోటంరాజు, సర్పంచ్ భువనగిరి సత్యన్నారాయణ, మారెడ్డి వెంకటాద్రిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పురాతన దేశ సంపద యోగా

- యోగాసనానికి ముందు ఓంకారంతో ప్రారంభించిన గురువులు
- కార్యక్రమంలో పాల్గొన్న 3 వేల మందికి పైగా విద్యార్థులు
- యోగా గురించి వివరించిన కలెక్టర్ దినేష్ కుమార్



పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో యోగా చేస్తున్న గురువు, అనుసరిస్తున్న బాలికలు



ముగింపు సభలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు సబర్బన్: జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ ఓంకార నాదంతో మారుమోగింది. గతంలో ఎన్నడూ లేనంతగా భారీ సంఖ్యలో విద్యార్థులు యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. శుక్రవారం సాయంత్రం నాలుగు గంటలకు ప్రారంభమైన యోగా కార్యక్రమంలో దాదాపు మూడు గంటలకు పైగా సాగింది. ఒంగోలు నగరంతో పాటు పరిసర ప్రాంత మండలాల నుంచి విద్యార్థులను పోలీస్ పరేడ్ గ్రౌండ్‌కు ఆయా పాఠశాలల యాజ మాన్యాలు తీసుకొచ్చాయి. దాదాపు అనేక పాఠశాలల నుంచి 3 వేల మందికి పైగా చిన్నారులు ఈ భారీ యోగా కార్యక్రమంలో పాల్గొని యోగా వలన కలిగే ప్రయోజనాలను ప్రదర్శించారు. సిద్ధ సంకల్ప యోగా సమితి వ్యవస్థాపకుడు పతంజలి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారుల చేసిన మహా సూర్య వందనం కార్యక్రమం అందరినీ అలరించింది. లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్– భారత వరల్డ్ రికార్డు నమోదులో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకొని మరీ నిర్వహించే విధంగా పూర్తి స్థాయి ఏర్పాట్లు చేయించారు. జిల్లా స్థాయి అధికారులను కార్యక్రమ ఏర్పాట్లలో భాగస్వాములను చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్ కార్యక్రమంలో మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. దేశంలో ప్రాచీన కాలం నుంచి యోగా ఉందన్నారు. ప్రజల్లో యోగాపై అవగాహనను పెంపొందించే కార్యక్రమానికి కూడా శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సుభద్ర, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఆర్.సుశీల, సోషల్ వెల్ఫేర్ డీడీ లక్ష్మా నాయక్, సెట్నల్ మేనేజర్ శ్రీమన్నారాయణ, గురువులు పాల్గొన్నారు.



విద్యార్థులతో పాటు యోగా చేస్తున్న జిల్లా అధికారులు

18న రోశయ్య కాంస్య విగ్రహావిష్కరణ

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి చేతులమీదుగా..
- ఆర్యవైశ్యులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలి
- వివరాలు వెల్లడించిన ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్



ఆహ్వాన ప్రతిని ఆవిష్కరిస్తున్న ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ తదితరులు

ఒంగోలు: తమిళనాడు మాజీ గవర్నర్, ఉమ్మడి ఏపీ మాజీ సీఎం కొణిజేటి రోశయ్య కాంస్య విగ్రహావిష్కరణ మహోత్సవం ఈనెల 18న స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ఎదురుగా నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్ పేర్కొన్నారు. జిల్లాలోని రోశయ్య అభిమానులు, ఆర్యవైశ్యులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శుక్రవారం స్థానిక వైశ్య భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రోశయ్య ప్రభుత్వంలో మంత్రిగా బాలినేని పనిచేశారన్నారు. రోశయ్య మరణ వార్త విన్న ఆయన స్వయంగా హైదరాబాద్ వెళ్లి నివాళులర్పించడంతోబాటు ఆయన పట్ల తనకు ఉన్న అభిమానానికి గుర్తుగా ఒంగోలులో రోశయ్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తానని ప్రకటించారన్నారు. అందులో భాగంగానే స్థానిక బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ఎదురుగా రోశయ్య విగ్రహాన్ని సొంత నిధులతో బాలినేని ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఇప్పటికే ఆరామక్షేత్రానికి విలువైన స్థలం కూడా బాలినేని కేటాయించారని, మరో వైపు ప్రభుత్వం కూడా ఆర్యవైశ్యులకు ప్రత్యేక స్థానం కేటాయించిందన్నారు. ప్రకాశం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు రావూరి కాశీరంగ జనార్దన్‌రావు మాట్లాడుతూ.. బాపూజీ మార్కెట్ కాంప్లెక్స్ ఎదురుగా విగ్రహానికి స్థలం కేటాయించడంతోబాటు అనుమతులు మంజూరు చేసిన నగరపాలక సంస్థ పాలక వర్గానికి, విగ్రహదాత బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. ముఖ్య అతిథులుగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్, శిద్దా రాఘవరావు, శాసనసభ్యులు మద్దాలి గిరి, అన్నా రాంబాబు, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు శిద్దా సుధీర్‌కుమార్ తదితరులు హాజరవుతున్నారన్నారు. ఒంగోలు సూపర్ బజార్ చైర్మన్, విగ్రహ కమిటీ చైర్మన్ తాతా బదరీనాథ్ మాట్లాడుతూ.. గత డిసెంబర్‌లో విగ్రహావిష్కరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని తుఫాను కారణంగా నాడు వాయిదా వేయాల్సి వచ్చిందన్నారు. ఈ నెల 18న ఆదివారం సాయంత్రం 5.45 గంటలకు విగ్రహావిష్కరణకు అందరినీ ఆహ్వానిస్తున్నామన్నారు. ఆర్యవైశ్య సంఘాల సమాఖ్య అధ్యక్షుడు గ్రంధె చెంచు రామారావు మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 16 సార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఘన చరిత్ర రోశయ్య సొంతమని కొనియాడారు. ఆయన విగ్రహం అందరిలో స్ఫూర్తి నింపాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఆర్యవైశ్య నాయకులు కోడూరి కిషోర్, అన్నెం శ్రీను, ఈశ్వర్, బియ్యపు విజయ్, గుర్రం బదరీనాథ్, ఎం.రంగనాయకులు, సురేష్ పాల్గొన్నారు.